ఉగాది కథల పోటీలో రూ. 600/- బహుమతి పొందిన కథ

# చేయూత

—నెల్లుట్ల రమాదేవి



"నీకు ఉత్తరం వచ్చింది యాదగిరీ!" వంగి కూర్చుని రిక్షాను తుడుస్తున్న యాదగిరి దగ్గరకి వచ్చి చెప్పాడు పోస్టమాన్ సత్యనారాయణ.

"అరె! నిజంగానా?" తుడుస్తున్న బట్టనలాగే సీటు మీద వదిలేసి లేచాడు.

"జల్ది ఇప్పి సదువు మరి... మా రాజు కాడ్నించే వస్తది... వారం దినాల నంది రోజూ జూస్తున్న" అన్నాడు ఆత్రంగా.

అతడి ఉత్సాహాన్ని గమనించి నవ్వుకుంటూ వుత్తరం విప్పాడు సత్యనారాయణ.

**"పూజ్యులైన నాయనగారికి, నమస్కారాలు...**

"గారెందుకు - గీరూ నాయనా అంటే సాలదా?" ముద్దుగా విసుక్కున్నాడు యాదగిరి.

"ముందు చదవనీ?" వారించాడు సత్యనారాయణ.

"సరె. సరె! కానీ!"

'మీరంతా క్షేమంగా వున్నారని తలుస్తాను. నేను ఎమ్మే ఫస్టు క్లాసులో పాస్ అయ్యాను. ఈ వార్త మీకెంతో సంతోషాన్ని కలిగిస్తుందని వెంటనే వుత్తరం వ్రాస్తున్నాను. అమ్మకు కూడా ఈ విషయం చెప్పండి.

నేను త్వరలో ఏదైనా ఉద్యోగం చూసుకుని నిన్నూ, అమ్మనూ ఇక్కడికి తీసుకు రావాలను కుంటున్నాను. మీరు నా కోసం ఇన్నాళ్ళూ పడిన కష్టాలు ఇక ముందు పడకూడదని నా కోరిక.

నేను ఆరో తారీఖున అంటే వచ్చే బుధవారం అక్కడికి వస్తున్నాను. ఇక వుంటాను.

మీ కుమారుడు
రాజు

"ఎంతైనా నువ్వు అదృష్టవంతుడివి యాదగిరీ! మీ రాజు చాలా బుద్ధిమంతుడు" ఉత్తరం మడిచి ఇచ్చేస్తూ అన్నాడు సత్యనారాయణ.

అప్పటికే కళ్ళలో తిరిగిన నీళ్ళను రుమాలుతో ఒత్తుకుంటున్నాడు యాదగిరి.

"ఏందన్నా?" అప్పుడే అక్కడికి వచ్చిన రాజయ్య, నర్సింలు అడిగారు.

"మా రాజు ఎమ్మే వస్టు క్లాసుల పాసయిండంట. ఇగో-గిప్పుడే మతలబు తెల్సింది." అనందంగా చెప్పాడు యాదగిరి.

"మల్ల నువ్వు ఇన్ని దినాలు పడ్డ కష్టం ఊకనే బోతాది? దినాంరాతిరి వాని గురించే సోంచాయిస్తివి!" నవ్వుతూ అన్నాడు నర్సింలు.

"గా పొల్లగాన్ని కూడ మెచ్చుకోవాలె! అయ్య కష్టపడి పైసల్ వంపితె మంచిగ సదువుకునేటోల్లు ఎందరున్నరన్నా? శాన బుద్ధిమంతుడు. ఒక్క పైస కూడ ఫూజుల్ కర్చు పెట్టడు నేను జూసిన కద!" అన్నాడు రాజయ్య.

తన కొడుకును గురించిన పొగడ్తలు వాళ్ళ నోటి ద్వారా విన్న యాదగిరి ఛాతీ పొంగిపోయింది.

"మా లచ్చిమికి ఈ ముచ్చట జెప్పి వస్త!" అంటూ స్టాండు లోంచి రిక్షా తీసి రయ్యిన దూసుకు పోయాడు

ఆ టౌను పక్కనే వున్న తరాలపల్లి యాదగిరి పుట్టి పెరిగిన వూరు. తండ్రి తాగుడుకూ, అప్పులకూ వున్న కాస్త భూమీ కరిగి పోయింది. తల్లి కూడా లేని యాదగిరీ, అతని అన్నా బికారులుగా నిలబడాల్సిన పరిస్థితి వచ్చింది. అన్న చిన్నప్పుడే పట్నం పోయి మేస్త్రి పని నేర్చుకుని అక్కడే స్థిరపడ్డాడు.

ఎవరి దగ్గరయినా జీతానికి వుండడమో, ఎక్కడయినా కూలి నాలి చేసుకోవడమో చిన్నప్పట్నించీ యాదగిరికి అలవాటయ్యింది. అన్న ఎన్నిసార్లు పట్నానికి రమ్మనీ, పని చూపిస్తాననీ పిల్చినా ఆ వూరు వదిలి వెళ్ళలేదు యాదగిరి.

తెల్లవారు ఝామున్నే వూడ్చి కళ్ళాపు చల్లిన వాకిళ్ళూ పొలాలకు వెళ్ళే ఎద్దుల మెళ్ళో గంటల గలగలలూ, అప్పుడే తల్లి కడుపులోంచి వచ్చిన శిశువులాగా చెరువు నీళ్ళపైన ఉదయించే సూర్యుడూ, కిచకిచలాడే పేరు తెలియని భాష మాట్లాడే పిట్టలూ — ఇవన్నీ అంటే అతనికి ఎంతిష్టం అంటే, వీటిని వదిలిపెట్టి పట్నం వెళ్లడానికి అతని మనసు సుతరామూ ఒప్పుకోలేదు.

ఎనిమిదేండ్ల వయసు నుండే దొరింట్లోనే పనిచేసాడు యాదగిరి. పట్నంలో స్కూల్లో చదువుకునే దొర పిల్లలు సెలవులకు వచ్చినప్పుడల్లా వాళ్ళతోటే గడిపేవాడు.

వాళ్ళు చదివే పుస్తకాలను కళ్ళింత చేసుకుని చూసే వాడు. వాళ్ళ గది తనే వూడ్చి పుస్తకాలన్నీ సర్దేవాడు. అర్థం కాకపోయినా సరే పుస్తకం కనబడితే మొదటి నుండీ చివరిదాకా తిప్పి చూసేవాడు.

యాదగిరికి చదువంటే వున్న ఇష్టం గమనించి దొర పెద్ద కొడుకు "చదువుకుంటావా యాదగిరీ!" అనడిగాడు.

"నాకు మీ లెక్క సదూకోవాలని శాన ఇష్టం గానీ, నాకు సదువెవ్వరు జెప్తరు దొరా?!" దిగులుగా అనేవాడు యాదగిరి.

"నీకంత ఇష్టంగా వుంటే నేను నేర్పుతాను గానీ, అలా దొరా గిరా అని పిలవొద్దు" అనేవాడతను.

తీరా పలకమీద రెండక్షరాలు దిద్దేసరికి ఎవరో పనికి పిలిచేవారు. రాత్రి పూట నేర్చుకుందామంటే పగలంతా పన్జేసి అలసిన శరీరం నిద్రకొరిగేది. ఈలోగా సెలవులయిపోయి వాళ్ళు వెళ్ళిపోయేవారు.

ఊర్లో భూములన్నీ అమ్మేసి దొరవాళ్ళు పట్నం వెళ్ళి పోవడంతో యాదగిరి కూలి పని చేసుకోవడం

మొదలు పెట్టాడు. లచ్చిమితో పెళ్ళయి, రాజు పుట్టాడు.

రాజుకు నాలుగేళ్ళు దాటినప్పటి నుండీ వాడిని మంచి బడిలో వేసి చదివించాలని యాదగిరిలో తహతహ మొదలయ్యింది.

తరాలవల్లిలో చిన్నబడి కూడా లేదు. కొందరు పిల్లలు ఐదు మైళ్ళ దూరంలో వున్న బస్తీకి వెళ్ళి చదువు కుంటారు. అంత చిన్న పిల్లాడిని వాళ్ళతో ఎలా పంపడం? చదివించకుంటే వాడూ తనలాగే కూలి పనిచేసుకోవాలి పెద్దయ్యాక.

ఎన్నో రోజులు ఆలోచించాక పక్కనున్న టౌనుకు మకాం మార్చాలని నిర్ణయించుకున్నాడు యాదగిరి. లచ్చిమికి పుట్టింటోళ్ళు ఇచ్చిన చెవుల కమ్మలు అమ్మి మిగతాది అప్పు చేసి, ఓ రిక్షా కొన్నాడు. లచ్చిమికి బీడీల కార్ఖానాలో పని దొరికింది. నెలకు ఇరవై రూపాయల కిరాయితో ఓ గుడిసెలో వుంటూ రాజును మంచి బళ్ళో వేసాడు.

రాజు మంచి మార్కులతో ఒక్కో క్లాసు పాసవుతున్న కొద్దీ యాదగిరిలోని ఆశలు అలాగే పెరగసాగాయి. తమ వాళ్ళలో ఎవ్వరూ చదువుకోనంత బాగా రాజుని చదివించాలన్నదే అతని తపన. అందుకోసం ఎంతైనా కష్టపడేవాడు. రాత్రిళ్ళు సెకండ్ షో టైం అయిపోయే దాక రిక్షా తొక్కేవాడు. తెల్లవారు ఝామున నాలుగింటికి ఏదో ఎక్స్‌ప్రెస్ రైలుందంటే లేచి స్టేషనుకు పోయేవాడు.

"ఇంత కష్టపడితే నీ ఆరోగ్యం పాడవుతుంది నాయనా!" అని రాజు అంటే,

'అయితే నాకేంది బిడ్డా! సదువయిపోయినంక నువ్వు మంచి కొలువు జేస్తే పెద్ద దవాఖాన్ల జూపి చ్చుకుంటలే!" అనేవాడు.

బి.ఏ. కోసం రాజును పట్నం పంపాడు. అదవగానే చదువు మానేసి ఉద్యోగం చూసుకుంటానంటే యాద గిరి ససేమిరా ఒప్పుకోలేదు. చివరిదాకా చదవాల్సిం దేనని పట్టుబట్టాడు.

"చదువుకి అంతు ఎక్కడుంది నాన్నా?" అని రాజు అంటే,

"గా ఎల్లయ్య కొడుకు కూడా బియ్యే చదివిండు గదుర! నువ్వు అంతకన్న మీదుండాలె" అన్నాడు.

"గింత సదువు రాంగనే ఒక్కొక్కనికి కండ్లు నెత్తి కెక్కుతయి. వాడు అందరి తరీక కాదు, తన కొడుకు." ఒక చేత్తో రిక్షా నడుపుతూ మరో చేత్తో కళ్ళద్దుకున్నాడు యాదగిరి.

* * *

రాజు వచ్చి వెళ్ళి నెల రోజులయింది. ఇంకా ఉద్యోగం రాలేదు. ఎక్కడ ఖాళీ వుంటే అక్కడ ప్రయత్నిస్తున్నానని ఉత్తరం రాసాడు. తొందరపడొద్దనీ, మంచి ఉద్యోగం దొరికేదాకా డబ్బుకు ఇబ్బంది పడ వద్దనీ, ఎప్పటిలాగా తనకు రాయమనీ మళ్ళీ ఉత్తరం రాయించాడు యాదగిరి.

నెలా - నెలా చూస్తుండగానే సంవత్సరం దాటి పోయింది. అయినా రాజుకెక్కడా ఉద్యోగం దొరక లేదు. లచ్చిమి ఆరోగ్యం బాగా దెబ్బతిన్నదనీ, ఆమెను బీడీ కార్ఖానాలో పని మాన్పించమనీ డాక్టరు చెప్పాడు. రిక్షా తొక్కేందుకు తనకూ ఒంట్లో సత్తువ లేదు.

యాదగిరిలో ఓపిక సన్నగిల్లింది. రాజుకు ఉద్యోగం దొరక్కపోవడం యాదగిరికి చాలా ఆశ్చర్యంగా వుంది. కోట్ల కొలదీ నిరుద్యోగులున్న ఈ దేశవ్యవస్థ గురించి నిజంగానే అతనికి తెలియదు.

"పట్నంల గన్ని ఆఫీసులుంటాయ్. నీకు ఒక్క దాన్ల గూడ కొలువు దొరుకుత లేదా?" ఒకసారి రాజు వచ్చినప్పుడు ఇక ఉండబట్టలేక అడిగాడు.

"నీకు తెలియదు నాన్నా! అలా ఆఫీసులుండగానే ఉద్యోగాలుండవు. ఒక్కో ఉద్యోగానికీ ఒక్కో రకం అర్హతలుండాలి. మనం ఒక్కళ్ళమే అన్ని రకాల అర్హతలూ కలిగి వుండం కదా! అదీగాక రికమండేష న్లనీ, లంచాలనీ, ఎన్నో దొంగ వ్యవహారాలుంటాయి" ఓపిగ్గా చెప్పాడు రాజు.

"మరయితే, నువ్వు ఇంత కష్టపడి సదివిందంతా దండుగేనా? నీ సదువు అక్కరకు రాదా?" నిరాశగా ప్రశ్నించాడు యాదగిరి.

"ఎందుకు రాదు? మనకూ ఎప్పుడో ఒకప్పుడు అవకాశం వస్తుంది. అయినా అక్కడ ఉద్యోగాల కోసం ఎందరు పడిగావులు పడుతున్నారో నీకేం తెల్సు? అటెందరు ఉద్యోగానికి కూడా నాకంటే చదువు కున్న వాళ్లొస్తారని తెలిస్తే నువ్విలా మాట్లాడవు!" ఉద్యోగం కోసం వెతికి వెతికి వేసారిన రాజు అస హనంగా అన్నాడు.

"నేనిప్పుడేమన్నారా? నువ్వు ఫస్టు క్లాసుల పాసైతివి. జల్ది ఉద్యోగం వస్తదనుకున్న" కొడుకు నోటి నుండి మొదటిసారిగా కోపంగా వచ్చిన మాటలకు చిన్నబుచ్చు కున్నాడు యాదగిరి.

"మీ నాయన ఏమన్నడని బిడ్డా గట్ల కోపం జేస్తివి! నువ్వింత సదువుకున్నందుకు అందరితోని ఎంత చెప్పుకుంటడనికిన్నవ్? ఎప్పుడు జూసినా నిన్ను యాద్ చేసుకుంటు ఉంటడు. కడుపు నిండ బువ్వ గూడ తినకుండ నిన్ను సదివించిండు గాదుర! నీకు కొలువొస్తే సూడాల్నని సంబురపడుతున్నడు!" అంది లచ్చిమి మధ్యలో కలుగజేసుకుని.

"నేనట్లా అనలేదమ్మా! నా ప్రయత్నాలు నేను చేస్తూనే వున్నాను. మిమ్మల్నిద్దర్నీ ఈ కష్టం చేయడం మాన్పించాలని నాకు మాత్రం లేదా? కానీ, ఈ రోజుల్లో ఉద్యోగం దొరకడం అంటే తేలిక కాదంటు న్నాను" అంటూ అక్కడినుంచి లేచి వెళ్ళిపోయాడు రాజు.

రాజు మనసు ఇంకెప్పుడూ కష్టపెట్టొద్దని నిర్ణ యించుకున్నారు యాదగిరీ, లచ్చిమీ.

ఏ మార్పు లేకుండా ఇంకో ఆర్నెల్లు గడిచాయి. ఓనాడు రాజు దగ్గర్నుండి వుత్తరం వచ్చింది ఉద్యోగం దొరికిందంటూ. కోటి దేవుళ్ళకు మొక్కుకున్నారు యాదగిరీ, లచ్చిమి. నెలకల్లా అయిదొందలు మనియార్డరు వచ్చింది.

లచ్చిమిని పని మాన్పించాడు యాదగిరి. ప్రతి నెలా రాజు దగ్గర్నుండి డబ్బొస్తోంది. నాలుగు నెల లయినా రాజు మాత్రం ఒక్కసారి కూడా రాలేదు.

"కొడుకు పోయి శాన దినాలాయె. ఎట్లున్నడో ఏందో? గా దినం మొగం చిన్నబుచ్చుకొని పోయిండు. పైసలు పంపితే తీస్కోబట్టిమి గానీ, గా వాని మత లబు తెల్సుకుంటలేమాయె. ఒక్కసారి పొయ్యి సూ సొద్దాం" అని లచ్చిమి భర్తను బ్రతిమిలాడింది.

యాదగిరికి కూడా మనసులో కొడుకుని చూడాలని ఆరాటంగానే వుంది. భార్య మాటల్తో అది మరింత ఎక్కువయింది.

"నువ్వెందుకు లేవే? ముందుగాల నేను పొయి సూసొస్త. ఇంకోసారి ఇద్దరం పోదాం!" అని తనొక్కడే బయలుదేరాడు.

* * *

సికింద్రాబాద్ స్టేషన్లో రైలు దిగి జనాన్ని తోసు కుంటూ బయటికొచ్చాడు యాదగిరి. జేబులో వున్న కొడుకు అడ్రసు కాగితం తీసి చేతిలో పట్టుకుని అటుగా వెళుతున్న ఒకతడిని ఆపి అడిగాడు ఎలా వెళ్ళాలని.

"అదిగో! మలక్‌పేట బస్సు రడీగా వుంది. అందులో వెళ్ళు. అక్కడ దిగాక మళ్ళీ ఈ కాగితం చూపిస్తే ఎవరయినా చెబుతారు" కాగితం యాద గిరికి ఇచ్చేసి హడావుడిగా వెళ్ళిపోయాడు అతడు.

"ఈ పట్నాలల్ల గింతే! ఎవ్వని లొల్లి వానిదే!" నవ్వుకున్నాడు యాదగిరి. "గా బస్సుల జనమంత ఏలాడుతున్రు. నేనేమెక్కుత? మల్ల దిగే కాడ గూడా తెల్వకపాయె. యాది మరిశిపోతే పరేషాన్ గావాలె - గియాల ఒక్క దినం ఆటోల పోతె సరిపాయె" అనుకుని ఆటోస్టాండు వైపు నడిచాడు.

దూరంగా ఆటోవాళ్ళంతా ఖాతాఖానీ కొడుతున్నారు. ఒక ఆటో డ్రైవర్ ఆటో మీద చేయి వేసి అటువైపు తిరిగి నిలబడి వున్నాడు.

"జర గీ జగాకు తీస్కపోతావ్ తమ్మీ!' అంటూ అతని భుజం మీద చేయి వేసాడు యాదగిరి.

ఆ ఆటోడ్రైవర్ గిరుక్కున వెనక్కు తిరిగి తన భుజం మీద చేయి వేసిందెవరా అని చూసి, మరు క్షణం చేష్టలుడిగి నిల్చుండిపోయాడు.

యాదగిరి పరిస్థితి కూడా అలాగే ఉంది.

'రాజు .. తన కొడుకు ఆటో నడుపుతుండా? ఇన్ని దినాల సంది తను పడ్డ తిప్పలంత వుట్టిదేనా! అందరికన్న ఎక్కువ సదూకోని పెద్ద ఉజ్జోగం చెయ్యా లని నేను అనుకుంటే నువ్వు జేసె కొలువు గిదా? ఎంత అవద్దమాడినవ్ బిడ్డా? నేను కోప్పడతనని ఆటో నడుపుకుంట ఉజ్జోగం దొరికిందని రాశినవా? అయినా, గిదేం నాయం కొడుకా? గింత సదువు కున్నోల్లకు కూడా ఉజ్జోగం దొరుకదా? మరెందుకరా నా అసంటోడు రెక్కలు ముక్కలు జేసుకొని సదు వించుండు? ఏమి సదువుకోని నేను రిచ్చ తొక్కితే ఎమ్మే సదివిన నువ్వు ఆటో నడుపుతావు గదరా! నీకు నాకు ఏం ఫరఖ్ వున్నదిరా? మరి గసంటప్పుడు సదువుకునుడెందుకురా?" అనేక ప్రశ్నలు దెబ్బతిన్న యాదగిరి కళ్ళల్లో కదలాడుతున్నాయి.

'నాన్నా! నన్ను క్షమించు నిజం చెప్పి నీ నమ్మకాన్ని పోగొట్టడం ఇష్టం లేక అబద్ధం రాసి మిమ్మల్ని అందమైన భ్రమలో ఉంచుదామనుకున్నాను. ఈలోగా ఏదైనా ఉద్యోగం దొరక్కపోతుందా అనుకున్నాను. పిచ్చి నాన్నా! ఈ దేశంలో డిగ్రీ కాగితాలు పొట్లాలు కట్టుకోవడానికి కూడా పనికి రావనీ, చదువుకోగానే ఉద్యోగం దొరకడం అనేది లాటరీ లాంటిదనీ నీకు వివరించి చెప్పాలనుకుని కూడా ఎప్పటికప్పుడు నిన్ను చూసి చెప్పలేకపోయేవాడ్ని. ఈ విషయం అసలు నీకు తెలిసే అవసరం రాకూడదనుకున్నాను.

మీలాంటి తండ్రులు నెత్తుర్ని చెమటగా చేసి, కొడుకు చదివిన చదువు పెద్ద ఉద్యోగాన్ని తెచ్చి పెడ్తుందని ఆశ పడ్తారు. విద్య కేవలం విజ్ఞానానికే ననీ, చదివిన ప్రతివాడూ ఉద్యోగం కావాలంటే ఎక్కడి నుంచి తెస్తామనీ పెద్ద పెద్ద వాళ్ళందరూ చెప్తారు. సంధియుగం వాళ్ళం నాన్నా మేము. అటు కులవృత్తి రాకుండా ఇటు చదివిన చదువుకు ఉద్యోగం రాకుండా కూలీనాలీ చేసుకోలేకుండా మిగిలిపోతాం. ఇలా ఎన్నాళ్ళు వుండాలి? అనే ప్రశ్న నన్ను వేధించి, బ్యాంకు లోనుతో ఈ ఆటో కొన్నాను. ఇది రావాలంటే కూడా ఎంత కష్టమో తెలుసా నాన్నా? పోనీలే - కనీసం ఇప్పుడు నా కాళ్ళ మీద నేను నిలబడ్డానన్న తృప్తయినా వుంది.'

ఈ మాటలు అనాలనుకున్న రాజు అనలేదు. యాదగిరి నోరు విప్పి అడగని ప్రశ్నలకు, రాజు చెంపల మీద నుండి జారే కన్నీళ్ళే సమాధానం చెప్పాయి. ❑